సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం : 3 : నవంబర్ : 2023



సగటుజీవికి 'కోడ్' కష్టాలు

ఎన్నికల నియమావళిలో భాగంగా పోలీసులు తనిఖీలు చేస్తూ నగదు జప్తు చేస్తున్నారు. దీంతో శుభకార్యాలకు నగదు తీసుకెళ్తున్న పేదలకు ఇక్కట్లు తప్పడంలేదు. IIలో▸



ఓటరు తీర్పు ప్రత్యేకం

ముధోల్ నియోజకవర్గ ప్రజలు మూడు రాష్ట్రాలు, మూడు జిల్లాల పాలనా చరిత్రను సొంతం చేసుకున్నారు. రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వాలకు భిన్నంగా ఇక్కడి ఓటర్లు స్థానిక అభ్యర్థులను గెలిపించారు. IIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0/21.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. చలి కాస్త తగ్గుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ నేత!



గోవర్ధన్‌రెడ్డి

సాక్షి, ఆదిలాబాద్: బీఆర్‌ఎస్ నేత బాలూరి గోవర్ధన్ రెడ్డి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరనున్నారు. జైనథ్ పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న గోవర్ధన్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఏ పదవీ దక్కకపోవడంతో నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీ మారేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో 'బీ'ఫాం తీసుకునేందుకు వెళ్తుండగా ఇదే సందర్భంలో గోవర్ధన్‌రెడ్డి పార్టీలో మరి కొంతమందితో కలిసి హస్తం గూటికి చేరనున్నట్లు సమాచారం.

విశ్రాంతి భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని సాత్నాల క్వార్టర్స్‌లో నిరుపయోగమైన ఇరిగేషన్ శాఖకు సంబంధించిన పెన్‌గంగా విశ్రాంతి భవనానికి మరమ్మతు పూర్తి కాగా గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రారంభించారు. అనంతరం అందులోని గదులు పరిశీలించారు. జిల్లా ఎన్నికల పరిశీలకులకు దీనిని కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో రాథోడ్ రాజేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, పర్యాటకశాఖ అధికారి రవీందర్ తదితరులున్నారు.

547 పాఠశాలల్లో సర్వే

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 547 ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థుల సామర్థ్యాల స్థాయిని పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. డైట్, బీఎడ్, మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఈ నెల 3నుంచి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు, గణితం సబ్జెక్టుల్లో మూడో తరగతి విద్యార్థులకు 40 ప్రశ్నలు, ఆరో తరగతి విద్యార్థులకు 50 ప్రశ్నలు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు 60 ప్రశ్నలు ఇచ్చి వారి స్థాయిని పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

ఆదిలాబాద్ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న శివకుమార్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన శివకుమార్ కందేకర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 'పాఠశాల పారిశుద్ధ్యం, పరిశుభ్రత' అనే అంశంపై డాక్టర్ విజయకుమార్ పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు శివకుమార్ ఈ సందర్భంగా తెలిపారు. శివకుమార్‌కు బుధవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ రవీందర్ డాక్టరేట్ ప్రదానం చేశారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



స్థానికులతో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

బేల: ఇంటి, నల్లా పన్నులు సకాలంలో చెల్లించి గ్రామపంచాయతీకి సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ కోరారు. గురువారం మండలకేంద్రంలోని మార్కెట్ కూడలిలో పర్యటించారు. పన్నుల వసూలు, పరిశుభ్రత పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృత్తి వ్యాపారులు లైసెన్స్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లకు త్వరలో పూర్తిస్థాయి వేతనాలు చెల్లిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుమీర్ హైమద్, పంచాయతీ కార్యదర్శి గజానన్, కారోబార్ కళ్యాణ్‌కార్ గజానన్, సిబ్బంది పాల్గొన్నారు.

'అసమ్మతి' ఏ వైపు?



- ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తారా?
- స్వతంత్రులుగా బరిలో నిలుస్తారా?
- ఆదిలాబాద్ నుంచి బీసీ అభ్యర్థిని బరిలోకి దించే ప్రయత్నంలో బీఎస్పీ
- సీపీఎం మొదటిజాబితా ప్రకటన నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి

సాక్షి, ఆదిలాబాద్: ప్రధాన పార్టీలకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు ఖరారయ్యారు. కాగా, జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నుంచి టికెట్ దక్కని పలువురు అసమ్మతి నేతలు బరిలో నిలిచేందుకు సిద్ధపడుతున్నారు. ఏదైన గుర్తింపు పార్టీ నుంచి పోటీ చేయాలా? లేదా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలా?.. అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలుకానుండగా వారంలోపే ఏదైన నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు.

ఆదిలాబాద్ అభ్యర్థిని తేల్చని బీఎస్పీ

బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నుంచి ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ అభ్యర్థులు ఖరారైపోయారు. ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో అసమ్మతివాదులు పోటీ చేసే విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలో అసమ్మతివాదులు అధికంగా ఉండగా, బీఆర్‌ఎస్ నుంచి టికెట్ దక్కనివారిలో సిట్టింగ్ ఎమ్మెల్యేలూ ఉన్నారు. పలువురు టికెట్ దక్కక పార్టీ మారిన సంగతి తెలిసిందే. ఇక గుర్తింపు పొందిన పార్టీ బీఎస్పీ వైపు కొందరు నిరాశవాదులు మొగ్గు చూపుతున్నారు. ఈ పార్టీ నుంచి బోథ్ నుంచి జంగు బాపురావు, ఖానాపూర్ నుంచి రాథోడ్ బన్సీలాల్, ఆసిఫాబాద్ నుంచి కనక ప్రభాకర్ బరిలోకి దిగారు. ఆదిలాబాద్ నుంచి ఆ పార్టీ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. బీసీని ఇక్కడి నుంచి పోటీ చేయించాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దిశగా కాంగ్రెస్‌కు చెందిన ఓ అసమ్మతి నేతతో బీఎస్పీ సంప్రదింపులు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆ నేత పోటీకి మొగ్గుచూపడంలేదని సమాచారం. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ టికెట్ ఇక్కడ ఎవరికి ఇస్తారనేది ఆసక్తిగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2014 ఎన్నికల్లో నిర్మల్, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బీఎస్పీ అభ్యర్థులుగా పోటీ చేసిన ఐకేరెడ్డి, కోనప్ప గెలుపొందారు. ఈ నేపథ్యంలో జనరల్ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆ పార్టీ ఆచీతూచి అడుగులు వేస్తోంది.

సీపీఎం జాబితా నేపథ్యంలో ఆసక్తి

కాంగ్రెస్‌తో కమ్యూనిస్టు పార్టీల పొత్తులు కొలిక్కి రాకపోవడం ఆసక్తికరంగా మారింది. సీపీఎం ఏకంగా రాష్ట్రంలో పోటీ చేసే 17మందికి సంబంధించి మొదటి జాబితా విడుదల చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పొత్తు కొలిక్కిరాకపోతే సీపీఐ కూడా సీపీఎంతో కలిసి వస్తుందా..? లేని పక్షంలో ఎలా ఉంటుందనేది ఈ వారం రోజుల్లో తేలనుంది. కమ్యూనిస్టు పార్టీలు జిల్లాలో ఏదైన నియోజకవర్గం నుంచి అభ్యర్థులను పోటీకి దింపనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఆదిలాబాద్ కాంగ్రెస్ నుంచి అసమ్మతివాదులు ఇటీవల సమావేశమై తమలో ఎవరినైనా రెబల్‌గా బరిలోకి దింపాలని యోచించారు. ఆ నిర్ణయాన్ని రెండు రోజుల్లో వెల్లడిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో వారి నుంచి ఎవరైనా బరిలోకి దిగుతారా? లేదా.. అనేది చూడాల్సిందే. అంతేకాకుండా ఆయా నియోజకవర్గాల్లో పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ



ఆదిలాబాద్‌లో నామినేషన్ స్వీకరణ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- అభ్యర్థితోపాటు నలుగురికి అనుమతి

కైలాస్‌నగర్/బోథ్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 3నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు మూడు వాహనాలనే అనుమతించనున్నారు. ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా ఆర్వో కార్యాలయాల వద్ద పోలీసులు బారికేడ్లు, వంద మీటర్ల దూరాన్ని తెలిపేలా సూచికలు ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు నలుగురు మద్దతుదారులను మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తారు. వందమీటర్ల దూరం నుంచి ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీ బందోబస్తు నిర్వహించనున్నారు.

నిఘా నీడలో ప్రక్రియ

నామినేషన్ల ప్రక్రియ అంతా నిఘా నీడలో జరగనుంది. ఆదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లను కలెక్టరేట్ ఆవరణలోని ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో, బోథ్ నియోజకవర్గ నామినేషన్లు బోథ్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో, నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గ నామినేషన్లు ఉట్నూర్ ఆర్డీవో కార్యాలయంలో స్వీకరించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రక్రియ పారదర్శకంగా చేపట్టేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు వీడియో చిత్రీకరించనున్నారు. ఆర్వో కార్యాలయ వివరాలు తెలిపేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్, రిటర్నింగ్ అధికారి స్రవంతి తెలిపారు. జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నామినేషన్ దరఖాస్తు ఫాంలో అన్ని ఖాళీలను పూరించాలని తెలిపారు. సంబంధిత పత్రాలు జత చేయాలని సూచించారు.



బోథ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఈఆర్వో చాహత్ బాజ్‌పాయ్

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

బోథ్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం పరిశీలించారు. ఏర్పాట్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు నామినేషన్ పత్రాలు స్వీకరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలను పరిశీలించారు. ఆయన వెంట ఈఆర్వో చాహత్ బాజ్‌పాయ్, తహసీల్దార్ సుభాష్‌చందర్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బందోబస్తు పరిశీలించిన ఎస్పీ

బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలు, వందమీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి గురువారం పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం బోథ్ సీఐ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలను సీఐ భీమేశ్, ఎస్సై రాముకు వివరించారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

నార్నూర్: విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఏటీడీవో క్రాంతికుమార్ సూచించారు. గురువారం భీంపూర్, మాన్కాపూర్, తాడిహత్నూర్, నార్నూర్ ఆశ్రమ పాఠశాలలు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్లు, రికార్డులు పరిశీలించారు. నార్నూర్ ఎస్టీ వసతి గృహాన్ని సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. దసరా సెలవుల తర్వాత విద్యార్థుల హాజరుశాతం చాలా తక్కువగా ఉందన్నారు. ఉపాధ్యాయులు హాజరుశాతం పెంచాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలలో సమస్యలు గుర్తించి ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. ఆయన వెంట వార్డెన్ రాజశేఖర్ తదితరులున్నారు.



నార్నూర్‌లో భోజనం పరిశీలిస్తున్న క్రాంతికుమార్

సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ ఖానాపూర్ అభ్యర్థినిగా ప్రియాంక



'బీ'ఫాం అందుకుంటున్న ప్రియాంక



ఉమేశ్‌కు 'బీ'ఫాం ఇస్తున్న విశారదన్

ఉట్నూర్‌రూరల్: సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ అనుబంధ ఆదివాసీ భారత మహాసభ ఖానాపూర్ అభ్యర్థినిగా ఆదివాసీ గిరిజన మహిళ పెందూర్ ప్రియాంకను రాష్ట్ర కార్యదర్శి ఎం.సైదయ్య ప్రకటించారు. గురువారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ప్రియాంకకు 'బీ'ఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఆదివాసీ జనాభా ఎక్కువగా ఉన్నా అభివృద్ధి, సంక్షేమాన్ని పాలకులు విస్మరించారని ఆరోపించారు. ప్రియాంకను గిరిజనులు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కనక లింబాబాయి, టేకం రేఖ, ఆత్రం విజయ్ పాల్గొన్నారు.

బోథ్ డీఎస్పీ అభ్యర్థిగా ఉమేశ్

బోథ్: ధర్మ సమాజ్ బోథ్ అభ్యర్థిగా ఉయిక ఉమేశ్‌ను ప్రకటిస్తూ గురువారం పార్టీ అధ్యక్షుడు విశారదన్ 'బీ'ఫాం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రాజ్యాన్ని తేవడమే పార్టీ లక్ష్యమని ఉమేశ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సత్తా చాటిన జూడో క్రీడాకారులు

ఆదిలాబాద్: వరంగల్ జిల్లాలో నవంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించిన 67వ ఎస్జీఎఫ్‌ఐ జూడో రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. బాలుర విభాగంలో మైనస్ 50 కేజీల ఈవెంట్‌లో ఆర్.తరుణ్, 50 ప్లస్ కేజీల విభాగంలో ఆర్.మధు గోల్డ్ మెడల్స్ సాధించారు. మైనస్ 40 కేజీల విభాగంలో పీ లోకేశ్ బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో 44 కేజీల ఈవెంట్‌లో కే అలేఖ్య, మైనస్ 44 కేజీల ఈవెంట్‌లో జీ సహస్ర స్వర్ణ పతకాలు సాధించారు. మైనస్ 40 కేజీల విభాగంలో డీ నాగినిప్రియ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నట్లు కోచ్ రాజు తెలిపారు. గోల్డ్‌మెడల్ సాధించిన క్రీడాకారులు ఈనెల 8నుంచి 14వ తేదీ వరకు జమ్మూ కశ్మీర్‌లో నిర్వహించనున్న 67వ ఎస్జీఎఫ్‌ఐ జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. క్రీడాకారులను ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కోరెడ్డి పార్థసారథి, డీవైఎస్వో వెంకటేశ్వర్లు, ఎస్జీఎఫ్ సెక్రటరీ కాంతారావు తదితరులు అభినందించారు.



పతకాలు అందుకుంటున్న విజేతలు

కన్నుల పండువగా రథోత్సవం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో గల శ్రీవేంకటేశ్వర, శ్రీగోపాలకృష్ణ స్వామి ఆలయంలో గురువారం రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీవారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి శోభాయాత్ర చేపట్టారు. గోవింద నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, కౌన్సిలర్ రవి, అర్చకులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నిమ్మలంగా ఆలోచించుండ్రి!



సభలో ప్రసంగిస్తున్న కేసీఆర్, పక్కన ఐకేరెడ్డి

- మీరు వేసే ఓటే మీ తలరాతను నిర్ణయిస్తది
- ఇంద్రకరణ్ సార్ హుషారున్నడు
- ఒక్కొక్కటి అన్నీ అడుగుతున్నడు
- ప్రజాఆశీర్వాదసభలో సీఎం కేసీఆర్
- యూజీడీ, ఇంజినీరింగ్, ఐటీ కావాలి..
- స్వర్ణ కాలువ లైనింగ్ పూర్తిచేయాలి..
- సభలో సీఎంను కోరిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



ప్రజా ఆశీర్వాదసభకు హాజరైన ప్రజలు

నిర్మల్: 'ఎన్నికలు చాలా వస్తయ్.. పోతయ్. అన్ని పార్టీల నుంచి ఎవరో ఒకరు నిలబడుతరు. ఎవరో ఒక్కరు గెలుస్తరు. కానీ.. మీరు వేసే ఓటే ఐదేళ్ల మీ తలరాతను నిర్ణయిస్తది. అందుకే అభ్యర్థుల గురించి తెలుసుకోవాలి. ఏ పార్టీకి ఓటేస్తే లాభమో.. ఏ ప్రభుత్వం ఏర్పడితే మంచి జరుగుతదో.. ఎవరి ఓటియ్యాల్నో గ్రామాలకు పోయినంక నిమ్మలంగా ఆలోచించాలి.. చర్చించాలి' అని అన్నారు సీఎం కేసీఆర్. నిర్మల్ జిల్లాకేంద్రంలోని క్రషర్‌గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన ప్రజాఆశీర్వాదసభలో మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రసంగం ఆయన మాటల్లోనే.. 'నిర్మల్ జిల్లాను చేసింది నేనే కావచ్చు కానీ.. ఆదిలాబాద్‌ల కొత్త జిల్లాల కోసం తపన పడింది ఇంద్రకరణ్‌రెడ్డే. ఒకరోజు హైదరాబాద్‌ల కూర్చుని జిల్లాల ఏర్పాటు గురించి మాట్లాడుతున్నం. ఆదిలాబాద్ ఎట్లాగున్నది ఇగ మంచిర్యాల ఒకటి చేస్తే సరిపోతుందని ఓ నిర్ణయానికి వచ్చినం. అప్పుడు ఇంద్రకరణ్‌రెడ్డి తన టీమ్‌ను తీసుకుని బయటకు వెళ్లి గంట తర్వాత మళ్లీ వచ్చిండు. సార్ ఇది మీ వల్లనే అయితదన్నడు. ఆదిలాబాద్ జిల్లాల బాగా అడవులు ఉండటం వల్ల దూరందూరంగా ఉన్నాయని, బాసర నుంచి ఆదిలాబాద్, బెజ్జూరు నుంచి ఆదిలాబాద్ రావాలంటే ఎంతదూరమో మీకు తెలుసని చెప్పిండ్రు. మంచిర్యాలతోపాటు నిర్మల్, ఆసిఫాబాద్‌లను కూడా జిల్లాలు చేయాలని గంటసేపు నాతో వాదించి ఆ జిల్లాలు అయ్యేందుకు కారణమైండు. నిర్మల్ జిల్లా ఏర్పాటు చేస్తే ఇగ ఏం అడగమని చెప్పిండు. మొన్న మెడికల్ కాలేజీ తెచ్చుకున్నడు. ఇప్పుడు ఇంజినీరింగ్ కాలేజీ అడుగుతున్నడు. మీ ఇంద్రకరణ్‌రెడ్డి సార్ బాగా హుషారున్నడు..' అని వివరించారు.

జిల్లాతో అనుబంధం ఉంది..

నిర్మల్ జిల్లాతో తనకు అనుబంధం ఉందని కేసీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నిర్మల్, ఆదిలాబాద్, ముధోల్ ప్రాంతాలకు వచ్చానన్నారు. ఉద్యమం కంటే ముందు వేణుగోపాలాచారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చాలాసార్లు ఇక్కడికి వచ్చానని గుర్తుచేసుకున్నారు. అప్పట్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని ఇక్కడి రైతులు వచ్చి బాధలు చెప్పుకునే వారని, ఇప్పుడు తెలంగాణలో ఆ పరిస్థితి లేదన్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి ఒక్కడే నిర్మల్ నియోజకవర్గానికి ఏకంగా 15 సబ్‌స్టేషన్లను తెచ్చుకున్నాడన్నారు.

ఇంజినీరింగ్ కాలేజీ కూడా వస్తది..

సభలో ముందుగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ కూడా కావాలని అడిగారు. దీనిపై సీఎం మాట్లాడుతూ.. ఇంద్రకరణ్‌రెడ్డికి పుట్టిన ప్రాంతమైన నిర్మల్‌పై ప్రేమ ఉందన్నారు. అందుకే ఒకటి కాగానే ఒకటి అడుగుతూనే ఉన్నారని సీఎం అనడంతో సభలో నవ్వులు విరిశాయి. ఈ సభను చూస్తుంటేనే ఇంద్రకరణ్‌రెడ్డి గెల్సిపోయిండని తెలిసిపోతోందని, ఎన్నికల రిజల్ట్ ఈరోజే అవుట్ అయిందని కేసీఆర్ అన్నారు. ఇక 70–80వేల మెజారిటీతో ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపిస్తే జేఎన్‌టీయూ నుంచి ఇంజినీరింగ్ కాలేజీ ఇప్పించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు.

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థులు వీరే..

ఎదులాపురం: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థులను పార్టీ జిల్లా అధ్యక్షుడు సందీప్ దాండగే జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ప్రకటించారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి కాంబ్లె భగవాన్, బెల్లంపల్లికి రాంటెంకి శ్రీనివాస్, సిర్పూర్ కాగజ్‌నగర్‌కు జాడి దీపక్‌కుమార్‌ను అభ్యర్థులుగా పార్టీ జాతీయ నాయకుడు ప్రకాశ్ అంబేడ్కర్ ప్రకటించినట్లు సందీప్ దాండగే తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో ప్రకాశ్ అంబేడ్కర్ సభలు ఉంటాయని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగసేన్‌బాబు మాన్కర్, ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ్ తెలంగ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు గుల్నాజ్ పర్వీన్, ఆర్తి కానిందే, శిరీష కదం, అనిల్, ప్రజ్ఞ తిగొటే తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సందీప్ దాండగే

క్లుప్తంగా

అమ్మ ఎన్నికల విధుల్లో...



తహసీల్ ఆవరణలో బాలుడు

బోథ్: అమ్మ విధుల్లో ఉండగా.. బాలుడు తహసీల్ కార్యాలయం ఆవరణలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఎన్నికల నేపథ్యంలో ఆయా మండలాల నుంచి బోథ్ ఎన్నికల కార్యాలయంలో ఎన్నికల విధులను కేటాయించారు. కాగా ఓ మహిళా అధికారికి బోథ్‌లో ఎన్నికల విధులను కేటాయించగా సంవత్సరం వయస్సు గల తన కుమారుడిని తన మామ వద్ద ఉంచి విధులు నిర్వహిస్తోంది. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అధికారిని మామ బాబును ఆడిస్తూ కనిపించాడు. తమ కోడలు ఎన్నికల విధులు నిర్వహిస్తోందని తెలిపాడు.

147మందిపై ఎక్సైజ్ కేసులు

ఆదిలాబాద్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా గత నెల 9 నుంచి ఇప్పటి వరకు ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహించి 147 కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 51 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. గుడుంబా తయారీకి ఉపయోగించే 20,760 లీటర్ల బెల్లం పానకం, ఇప్పపువ్వు పానకం ధ్వంసం చేసినట్లు వివరించారు. 586 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. బెల్టు షాప్‌లపై దాడులు చేసి 131.31 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

80మందిపై కేసులు నమోదు

ఇచ్చోడ: ఎన్నికల కోడ్ సందర్భంగా 80మందిపై వివిధ రకాల కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రాజమౌళి తెలిపారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వివరాలు వెల్లడించాడు. అక్టోబర్‌లో జరిగిన తనిఖీలో 355లీటర్ల నాటుసారా, 8వేల లీటర్ల బెల్లం పానకం, 670లీటర్ల తెల్లకల్లు ధ్వంసం చేసి 57మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 51లీటర్ల విస్కి, లిక్కర్‌తో పాటు నాలుగు వాహనాలను జప్తు చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనలో 23మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఇతర సమాచారం కోసం 1800–425–2523 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా లేదా 08732–220076 కంట్రోల్ రూంలోని ఫోన్ నంబర్‌కు లేదా 8712658781 సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన పలు దుకాణాల యజమానులపై వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి రాత్రి పది గంటల అనంతరం దుకాణాలు తెరిచి ఉంచకూడదనే నిబంధన లున్నాయి. అయితే ఈ నిబంధనలు ఉల్లంఘించిన అస్లాంబిన్ సలేహా, వికార్ హైమద్, నాగేందర్, మహేందర్, విక్రమ్ అనే దుకాణదారులపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఎస్ఐ కలీం తెలిపారు.

సగటు జీవికి కోడ్ కష్టాలు..

సారంగాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి పెళ్లి నిశ్చయమైంది. అయితే మధ్యతరగతి కుటుంబానికి చెందిన యువతి పెళ్లికి సంబంధించిన మొత్తం బాధ్యత తన మేనమామ భుజాన వేసుకున్నాడు. నవంబర్ నెలలో ముహూర్తం కుదిరింది. ఇక పెళ్లి పనులు ప్రారంభమైన దశలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. పెళ్లికి సంబంధించిన బంగారం, వస్త్రాలు ఇతర సామగ్రి కొనుగోళ్లపై ఎఫెక్ట్ పడింది. చేతిలో ఉన్న నగదుతో వెళితే తనిఖీలతో సమస్యలు తలెత్తుతాయోనన్న ఆందోళన ఆయనలో నెలకొంది.

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి ఓ ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. తన కలల ఇంటి కోసం ప్లాటు కొనాలని నెలనెలా డబ్బులు కూడబెట్టుకున్నాడు. ఈ ఆలోచనలో ఉండగానే ఎన్నికల కోడ్ వచ్చేసింది. దీంతో నగదు చెల్లించి ప్లాటు కొనాలనే ఆలోచనకి బ్రేక్ వేశాడు. ఎన్నికల నేపథ్యంలో నగదు తనిఖీలతో తంటాలు ఎందుకని అనుకున్నాడు.



వినియోగదారులు లేక వెలవెలబోతున్న బంగారు వర్తక దుకాణం

- పెళ్లిళ్ల సామగ్రి కొనుగోళ్లకు ఆటంకం
- బంగారం వర్తకుల బేజారు..
- రియల్ మార్కెట్ పై ఎఫెక్ట్
- ప్లాట్లు, భూముల రిజిస్ట్రేషన్లు అంతంతే
- వ్యాపారుల వెతలు వర్ణనాతీతం

నిర్మల్‌ఖిల్లా: ఎందరో సాధారణ, మధ్యతరగతి కుటుంబీకులు తమకు సంబంధించిన నగదుతో బంగారం, కొనుగోళ్లు ఇతరాత్ర స్థిర, చరస్థిరాస్తుల కొనుగోళ్లలో వెనుకడుగు వేస్తున్నాడు. ఎన్నికల నియమావళి నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తూ నగదు జప్తు చేస్తుండడంతో పేద, మధ్యతరగతి వారిపై ప్రభావం పడింది. దీంతో రియల్ ఎస్టేట్ రంగం కూడా స్తబ్దుగా మారింది. దీనికి తోడు పెళ్లిళ్లకు అవసరమైన వస్త్రాలు, బంగారం కొనుగోలు, ఇతర సామగ్రి కొనుగోళ్లకు నగదు వెంటపెట్టుకోకపోవడం పెద్ద తల నొప్పిగా తయారైంది. డిజిటల్ చెల్లింపుల వైపు చూస్తున్నా అన్నిచోట్ల ఇది సాధ్యపడకపోవడంతో దీని ప్రభావం తీవ్రంగానే ఉంది.

వర్తకుల వెతలు వర్ణనాతీతం...

నిర్మల్ నుండి టోకున కొనుగోలు చేసే బంగా రు వర్తకుడు హైదరాబాద్ ప్రాంతంలో టోకు బంగారం తీసుకువస్తుండగా పోలీసుల తనిఖీ ల్లో బంగారం తెస్తున్నట్లు గుర్తించారు. ఆ బంగా రానికి సంబంధించిన రసీదులు, ధ్రువీకరణ పత్రాలు ఆ సమయంలో లేకపోవడంతో ఇ బ్బందులు ఎదుర్కొన్నాడు. ఎట్టకేలకు వారం రోజుల అనంతరం సంబంధించిన రసీదులు, పత్రాలు చూపించి పోలీసులు జప్తు చేసిన బంగారాన్ని విడిపించుకున్నాడు. ఇలా ప్రతి నెలలో రెండు, మూడు సార్లు ఇలా బంగారం వ్యాపారులు బంగారాన్ని తీసుకొస్తామని, ఇది కొత్త కాదని వారంటున్నారు.

శుభకార్యాల నిర్వహణకు కోడ్ కష్టాలు..

నవంబర్‌లో 16వ తేదీ నుంచి వరుసగా శుభ ముహూర్తాలు ఉండడంతో వివాహాలకు అన్ని సిద్ధం చేసుకున్నారు. ఈ తరుణంలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఫంక్షన్ హాళ్లు కూడా ప్రచార వేదికలుగా మారుతుండడంతో పెళ్లిళ్ల నిర్వహణ భారంగా పరిణమిస్తోంది. మ రోవైపు గరిష్టంగా రూ.50వేలకు మించి నగదు లభిస్తే సంబంధిత పత్రాలు చూపాల్సి రావడం లేదా జప్తు చేసుకోవడానికి పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తుండడంతో సాధారణ ప్రజానీకం హడలిపోతున్నారు. ఇంట్లోని వివా హాది శుభకార్యాల కోసం తులం బంగారం కొనాలన్న రూ.60 వేల వరకు అవసరమవుతుంది. అయితే వారు దాచుకున్న డబ్బులతో బంగారం కొనడానికి వెళ్తే తలెత్తే సమస్యలను ఆలోచించి వెనుకడుగు వేస్తున్నారు.

వెనుకడుగు వేస్తున్నారు...



ఎన్నికల ఎన్నికల నియమావళి అమల్లో ఉండడంతో బంగారం కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. కొనుగోళ్లు భారీగా తగ్గాయి. నగదుతో కొనుగోలు చేసే వినియోగదారులు వెనుకడుగు వేస్తుండడంతో వ్యాపారం అంతంత మాత్రంగానే సాగుతోంది.వచ్చిన గిరాకీలకు ఆభరణాలను తయారు చేయించే క్రమంలో కూడా బంగారం తీసుకెళ్తున్నప్పుడు పోలీసుల తనిఖీలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

– శెట్‌పల్లి శివకుమార్, స్వర్ణకారుడు, వైష్ణవి గోల్డ్ వర్క్స్, నిర్మల్

ఓటరు తీర్పు ప్రత్యేకం..

- మూడు రాష్ట్రాలు, మూడు జిల్లాల ముథోల్..!
- అధికారానికి భిన్నంగా ఫలితం..



భైంసాటౌన్: తెలంగాణ రాష్ట్రంలో ముథోల్ నియోజకవర్గానికి ప్రత్యేకత ఉంది. మూడు రాష్ట్రాలు, మూడు జిల్లాల పాలనా చరిత్రను సొంతం చేసుకున్న ఇక్కడి ప్రాంత ప్రజలు ఇప్పటికీ సరిహద్దు మహారాష్ట్ర ప్రాంత ఆచార వ్యవహారాలను పాటిస్తుంటారు. పండుగలు, ఉత్సవాల్లోనూ అక్కడి వారి పద్ధతులను అనుసరిస్తుంటారు. పాలనాపరంగా పరిశీలిస్తే రాష్ట్రాల పునర్విభజన 1956కు ముందు ముథోల్ నియోజకవర్గం సరిహద్దు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొనసాగింది. 1957 నుంచి అసెంబ్లీ స్థానాల ఎన్నికలు ఇప్పటి వరకు 14సార్లు ఎన్నికలు జరిగాయి. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడగా 2016లో జిల్లాల పునర్విభజనతో నిర్మల్ జిల్లాలో చేరింది. ఇలా మూడు రాష్ట్రాలు (మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ), మూడు జిల్లాలు (నాందేడ్, ఆదిలాబాద్, నిర్మల్) పాలనా చరిత్రతో ముథోల్‌కు ప్రత్యేకత ఉంది.

తీర్పులో విభిన్నం...

2014 వరకు ముథోల్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే.. రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వాలకు భిన్నంగా స్థానిక అభ్యర్థిని గెలిపించారు ఇక్కడి ఓటర్లు. 1983లో రాష్ట్రంలో టీడీపీ విజయంతో ఎన్టీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేయగా, ఇక్కడ కాంగ్రెస్ పార్టీ నుంచి గడ్డిగారి గడ్డెన్న గెలిచారు. 1999లోనూ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డెన్నను మరోసారి గెలిపించారు. 2004లో అప్పటి సీఎం, దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరగా, ఇక్కడ టీడీపీ అభ్యర్థి ఎస్ వేణుగోపాలచారికి విజయం కట్టబెట్టారు. ఇక 2014లో రాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయగా ఇక్కడ కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన గడ్డిగారి విఠల్‌రెడ్డి విజయం సాధించాడు. ఇలా 2014 వరకు రాష్ట్రంలో అధికారానికి భిన్నంగా తీర్పు ఇచ్చిన ముథోల్ ఓటర్లు 2018లో మాత్రం టీఆర్ఎస్ రాష్ట్రంలో, స్థానికంగా టీఆర్ఎస్ అభ్యర్థికే పట్టం కట్టారు.

పనిచేసే వారికే పట్టం



గుట్టలు, అడవి మధ్యలోని ఆదివాసీ గ్రామం పాలవాగు

- బోథ్ ఓటర్ల విలక్షణ తీర్పు

ఇచ్చోడ: అడవులు, ప్రకృతి సోయగాలు, తండాలు, మారుమూల గ్రామాలు ఉన్న బోథ్ నియోజకవర్గంలో ఎన్నికలు జరిగిన ప్రతీసారి ఓటర్లు విలక్షణమైన తీర్పు ఇచ్చారు. ఈ నియోజకవర్గంలో బోథ్, ఇచ్చోడ, నేరడిగొండ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, సిరికొండ, తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలున్నాయి. కులమతాలు, పార్టీలు కాకుండా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేవారికి పట్టంకట్టారు. నియోజకవర్గం ఏర్పడి నుంచి 13సార్లు సాధారణ ఎన్నికలు జరిగాయి. ఒక్కసారి నేషనల్ కాంగ్రెస్, నాలుగు సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, మూడు సార్లు టీఆర్ఎస్ అభ్యర్థులు , 2004 జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇక్కడ టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సోయం బాపురావు విజయం సాధించారు. 2009లో రెండోసారి కాంగ్రెస్‌లోకి అధికారంలోకి వచ్చిన ఇక్కడ టీడీపీ అభ్యరి గోడం నగేష్ విజయం సాధించగా ఓటర్లు విలక్షణమైన తీర్పును ఇచ్చారు.

7న జిల్లాస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్

నిర్మల్‌రూరల్: జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల విద్యార్థులకు ఈనెల 7న కొత్త కలెక్టరేట్ రోడ్‌లోని వాసవి వరల్డ్ స్కూల్‌లో జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆరోగ్యం శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం అనే ప్రధాన అంశానికి సంబంధించి ఈ ప్రాజెక్టు చేపట్టాలని సూచించారు. ఇందులో పర్యావరణ వ్యవస్థను తెలుసుకోవడం, ఆరోగ్యం పెంపొందించడం, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు, స్వీయ ఆధారితం కోసం పర్యావరణ వ్యవస్థ, ఆధారిత విధానం, ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణ మొదలైన ఉపాంశాలు ఉంటాయన్నారు. ఒక పాఠశాల నుండి ఒక ఉప అంశాల్లో ఒకటి చొప్పున 5 వరకు మాత్రమే ప్రాజెక్టులకు అనుమతిస్తామన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్ సెల్.9440069830లో సంప్రదించాలన్నారు.

దేశీదారు పట్టివేత

తాంసి: భీంపూర్ మండలం ధనోర గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న 180 ఎంఎల్ కలిగిన 18 బాటిళ్ల దేశీదారును ఎస్సై లాల్‌సింగ్‌నాయక్ గురువారం పట్టుకున్నారు. దేశీదారును తరలిస్తున్న ధనోర గ్రామానికి చెందిన అమూల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పట్టుకున్న మద్యం విలువ రూ.2వేలు ఉంటుందని ఎస్సై తెలిపారు. సిబ్బంది స్వామి, షకీల్ ఉన్నారు.

దాడి చేసిన వారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వడ్డెర కాలనీలో మంజుల నాగమణి ఇంటి ఎదుట చెట్టు కొమ్మలు పైనున్న విద్యుత్ తీగలకు తాకుతున్నాయని బుధవారం చెట్టును నరికివేశాడు. దీంతో చెట్టును ఎందుకు నరివేశారంటూ పొరుగున ఉండే నర్సింలు, శీను, పేరయ్యతో పాటు మరికొందరు ఘర్షణకు దిగారు. మంజుల నాగమణితో ఆటు ఆమె మామ లచ్చన్నపై దాడి చేశారు. దీంతో మంజుల నాగమణి గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



రమాకాంత్ మృతదేహం

జైనథ్: మండలంలోని భోరజ్ గ్రామానికి చెందిన రమాకాంత్(26) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. రమాకాంత్ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం బయటకు వెళ్లిన ఆయన సాయంత్రం భోరజ్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై శవమై కనిపించాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి 108కు ఫోన్ చేశారు. అప్పటికే అతడు మృతి చెందడంతో 108 తిరిగి వెళ్లిపోయింది. మృతదేహాన్ని ఆటోలో రిమ్స్‌కి తరలించారు. మృతదేహం వద్ద సూసైడ్ నోట్‌లో దళితబంధు రాకపోవడంతోనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఉందని, తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు నర్సింగ్, చంద్రభాగ వేడుకుంటున్నారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గాయపడిన బీజేపీ కార్యకర్త మృతి

- కుటుంబానికి రూ.3లక్షలు ఎంపీ సాయం



కుమ్రం రమేష్ (ఫైల్)

తాంసి: బీజేపీ బోథ్ అభ్యర్థి సోయం బాపురావుకు మద్దతుగా బుధవారం నిర్వహించిన బైక్ ర్యాలీలో బైక్ అదుపు తప్పి భీంపూర్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి బీజేపీ కార్యకర్త కుమ్రం రమేష్ (26) గాయపడిన విషయం తెలిసిందే. కార్యకర్తలు రిమ్స్‌లో చేర్పించగా అక్కడి నుంచి ఎంపీ సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో బీజేపీ మండల అధ్యక్షుడు రాకేష్ యాదవ్, జిల్లా నాయకుడు దేవారెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అండగా నిలిచిన ఎంపీ..

బైక్ ర్యాలీలో గాయపడి మృతిచెందిన కార్యకర్త కుటుంబానికి బీజేపీ బోథ్ అభ్యర్థి, ఎంపీ సోయం బాపూరావు అండగా నిలిచారు. మెరుగైన వైద్యం కోసం ఆర్థికసాయం అందించాడు. మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎంపీ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించాడు. ఆ కుటుంబానికి రూ.3లక్షల ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు.

రమేశ్ నేత్రాలు సజీవం..

కుమ్ర రమేష్ నేత్రాలను దానం చేసేందుకు భార్య కుమ్ర యమునా ముందుకొచ్చింది. ఎల్వీ ప్రసాద్ ఇన్స్టిట్యూట్ వారికి సమాచారం అందించడంతో రిమ్స్‌లో నేత్రాలను సేకరించారు.

ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై బుధవారం స్థానిక వంతెన వద్ద జరిగిన ఆటో రోడ్డు ప్రమాదంలో ఇంద్రవెల్లి మండలంలోని ధనోరా(బి) గ్రామానికి చెందిన ప్రయాణికురాలు మొబీనా (54) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఆటోలోని మిగతా ప్రయాణికులు కోలుకుంటున్నారని ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నిర్మల్‌టౌన్: బైక్‌పై నుంచి పడి ఒకరు ప్రాణాలు కోల్పోయిన సంఘటన బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై జ్యోతిమణి వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని కిన్వట్ ప్రాంతానికి చెందిన కొమ్మోజివార్ గంగాధర్ (45) ఏడేళ్ల క్రితం పనినిమిత్తం నిర్మల్‌కు వచ్చాడు. ఈ క్రమంలో పట్టణంలోని శివాజీచౌక్ ప్రాంతంలో అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటూ.. రత్నాపూర్ కాండ్లి గ్రామంలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో అదుపుతప్పి కిందపడటంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనం అతివేగంగా నడపడంతో అదుపుతప్పి ప్రమాదానికి గురై ఉండొచ్చని, లేదా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకొని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి వివరాల ప్రకారం.. లక్ష్మణచాంద మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన సంగెం బద్దెన్న, సాకలి గణపతి ప్రజాఆశీర్వాద సభకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కొండాపూర్ వద్ద వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో బద్దెన్నకు ఎడమ కాలు విరిగిపోయింది. గమనించిన స్థానికులు చికిత్స కోసం ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు ప్రస్తుతం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

జన్నారం(ఖానాపూర్): ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సతీష్ వివరాల ప్రకారం.. మురిమడుగు గ్రామానికి చెందిన తుంగూరి రాఘవులు, శాంత దంపతుల కుమారుడు తుంగూరి బాలాజీ (బాలు) (19) పదోతరగతి చదువుతున్నాడు. ఇటీవల జ్వరం రావడంతో ఆస్పత్రిలో చికిత్స చేయించారు. జ్వరం తగ్గినా 15 రోజులుగా స్కూలుకు వెళ్లకుండా ఇంట్లో ఉంటూ మానసిక ఆందోళనకు గురవుతున్నాడు. బుధవారం దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

బీఆర్ఎస్‌లోకి పెంబి జెడ్పీటీసీ




జానుబాయికి కండువా కప్పుతున్న మంత్రి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో బీజేపీ ఖానాపూర్ టికెట్ ఆశించిన పెంబి జెడ్పీటీసీ జానకిబాయి, ఖానాపూర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆమెకు మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని జానకిబాయి పేర్కొన్నారు. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఉన్నారు.

జిల్లా వాసులకు డాక్టరేట్



డాక్టరేట్ స్వీకరిస్తున్న పీజీరెడ్డి



కటకం మురళి



అజయ్

- చరిత్రవిభాగంలో ఇద్దరికి..
- హిందీ విభాగంలో మరొకరికి..

నిర్మల్ ఖిల్లా: నిర్మల్ జిల్లాకు చెందిన పలువురు శత వసంతాల ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలను స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన ఉస్మానియా యూనివర్సిటీ 83వ స్నాతకోత్సవంలో జిల్లాకు చెందిన కటకం మురళి, పీజీ.రెడ్డి, అజయ్ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్, అడోబ్ సీఈవో పద్మశ్రీ శంతన్ నారాయణ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాలను స్వీకరించారు. జిల్లా కేంద్రానికి చెందిన కటకం మురళి, పీజీ.రెడ్డి చరిత్ర విభాగంలో డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా, అజయ్ హిందీ విభాగంలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఏకకాలంలో జిల్లా నుంచి పలువురు డాక్టర్ పట్టాలను స్వీకరించడం జిల్లాకే గర్వకారణమని నిర్మల్ జిల్లా చరిత్రకారులు, విద్యావేత్తలు అంటున్నారు. వీరిని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు భీమారావు, సుధాకర్, పలువురు అధ్యాపకులు అభినందించారు.

'కల్వకుంట్ల పాలన నుంచి విముక్తి కల్పించాలి'

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



కాంగ్రెస్ లో కి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: జూటామాటలు మాటలతో గద్దెనెక్కుతూ తన కుటుంబాన్ని మాత్రమే బంగారుమయం చేసుకుంటున్న కల్వకుంట్ల పాలన నుంచి తెలంగాణ రాష్ట్రానికి విముక్తి కల్పించాలని, సీఎం కేసీఆర్ మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నిర్మల్ అభ్యర్థి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్ పట్టణంలోని రాంనగర్, రాంరావ్‌బాగ్, గాజులపేట్, బైల్‌బజార్, వైఎస్సార్ కాలనీకి చెందిన నాయకులు, కార్యకర్తలు శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయాడన్నారు. మరోసారి మోసపూర్తి మాటలతో అధికారంలోకి వచ్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణను బంగారు మయం చేస్తానని చెప్పి ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చాడని వివరించారు. 40 ఏళ్లు నిర్మల్ ఎమ్మెల్యేగా పనిచేసిన ఇంద్రకరణ్‌రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. నిర్మల్ జిల్లా ఏర్పడిన తర్వాత మంత్రి కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ భూములను కబ్జా చేసి ఆస్తులు పెంచుకున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో మంత్రిని చిత్తుగా ఓడించాలని కోరారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
3-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
490	144
64,081	19,133

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,260	▲	199
డోజోన్స్	33,721	▲	446
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,447	▲	104
డాక్స్	15,144	▲	220
షాంఘై	3,009	▲	14
నికాయ్	31,950	▲	348

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,092	▲	80
బంగారం (99.5 స్వచ్ఛత)	60,847	▲	79
వెండి (కిలో)	71,684	▲	700

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎన్‌ఈ	82.49	84.26
£	బ్రిటన్ పౌండ్	ఎన్‌ఈ	99.73	101.94
€	యూరో	ఎన్‌ఈ	86.78	89.19
¥	జపాన్ ఎన్ (100)	ఎన్‌ఈ	54.27	55.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎన్‌ఈ	51.63	54.39
S$	సింగపూర్ డాలర్	ఎన్‌ఈ	59.12	60.98
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.87	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.23	12.29

పోస్ట్ ద్వారా 2,000 నోట్ల మార్పిడి

బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమ



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 నోట్లు మార్చుకోవడానికి సులభతరమైన విధానం అమలవుతోంది. పోస్ట్ ద్వారా ఈ మేరకు ప్రజలు సేవలు పొందవచ్చని ఇప్పటికే ప్రకటించిన ఆర్‌బీఐ ఉన్నతాధికారులు ఇందుకు వీలైన ప్రక్రియపై ప్రచారాన్ని చేపట్టారు. ఇన్సూర్డ్ పోస్ట్ లేదా టీఎల్ఆర్ (3 అంచెల రక్షణ) కవర్‌ను వినియోగించుకుని సురక్షితమైన మార్గంలో రూ.2,000 నోట్లు మార్చుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ విధానంలో పెద్ద నోట్ల మార్పిడికి సంబంధించిన డబ్బు సంబంధిత వినియోగదారు బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. ''కస్టమర్‌లు రూ. 2,000 నోట్ల మార్పునకు సంబంధించిన డబ్బు తమ ఖాతాలో అత్యంత సురక్షితమైన పద్ధతిలో ప్రత్యక్షంగా క్రెడిట్ కావడానికి వీలుగా ఇన్సూర్డ్ పోస్ట్‌ను వినియోగించుకోవాలని ప్రోత్సహిస్తున్నాము. ఈ విధానం నిర్దేశిత ప్రాంతీయ కార్యాలయాలకు ప్రయాణించడం, వరుసలో నిలబడ్డం వంటి ఇబ్బందుల నుంచి వినియోగదారుని నివారిస్తుంది'' అని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ రోహిత్ పి. దాస్ అన్నారు. చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. అక్టోబర్ 30వ తేదీ నాటికి రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలు 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి.

కోటక్ ఇన్సూరెన్స్‌లో 'జ్యూరిక్'కు వాటాలు

51% కొనుగోలు; డీల్ విలువ రూ. 4,051 కోట్లు

ముంబై: సాధారణ బీమా సంస్థ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో (కేజీఐ) స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యూరిక్ ఇన్సూరెన్స్ 51 శాతం వాటాలు దక్కించుకోనుంది. ఇందుకోసం రూ. 4,051 కోట్లు వెచ్చించనుంది. తదుపరి అదనంగా మూడేళ్లలో అదనంగా 19 శాతం వాటాలు కూడా జ్యూరిక్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయనున్నట్లు కేజీఐ మాతృ సంస్థ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్న కీలక మార్కెట్లలో భారత్ కూడా ఒకటని, కేజీఐ తమకు పటిష్టమైన భాగస్వామి కాగలదని జ్యూరిక్ సీఈవో (ఆసియా పసిఫిక్) తులసి నాయుడు తెలిపారు. తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇరు సంస్థల వనరులు, అనుభవం తోడ్పడగలవని కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ దీపక్ గుప్తా పేర్కొన్నారు. ప్రీమియంలపరంగా నాన్-లైఫ్ మార్కెట్‌లో సెప్టెంబర్‌లో కేజీఐకి 0.52 శాతం వాటా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,148 కోట్ల మేర స్థూల ప్రీమియం సాధించింది. కొత్త పెట్టుబడుల అనంతరం సంస్థ విలువ రూ. 7,943 కోట్లుగా ఉండనుంది.


ఫ్యాషన్ స్టార్టప్స్‌లో అజియో పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 100 డైరెక్ట్ టు కస్టమర్ ఫ్యాషన్ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టాలని లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఈ-కామర్స్ కంపెనీ అజియో భావిస్తోంది. ఈ స్టార్టప్స్ తయారు చేసే, విక్రయించే దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్ వంటి ఉత్పత్తులను డైరెక్ట్ టు కన్స్యూమర్ వేదిక అయిన అజియోగ్రామ్‌లో అందుబాటులో ఉంచనుంది. భారతీయ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ విభాగంలోని 200 బ్రాండ్స్‌ను ఎక్స్‌క్లూజివ్‌గా అజియోగ్రామ్‌లో వచ్చే ఏడాదికల్లా చేర్చనున్నట్టు వెల్లడించింది. ఈ బ్రాండ్స్ విస్తరణకు, ఆదాయ వృద్ధికి పూర్తి సహకారం అందించనున్నట్టు అజియో ప్రకటించింది.

దాతృత్వంలో శివ్ నాడార్ టాప్

- రూ. 2,042 కోట్ల విరాళం
- ఎడెల్‌గివ్ హురున్ ఇండియా లిస్టులో అగ్రస్థానం



ముంబై: విరాళాలివ్వడంలో ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ్ నాడార్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. 2023లో ఏకంగా రూ. 2,042 కోట్లు విరాళమిచ్చి ఎడెల్‌గివ్ హురున్ ఇండియా 2023 జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. గతేడాది ఇచ్చిన రూ. 1,161 కోట్లతో పోలిస్తే ఇది 76 శాతం అధికం. విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ రూ. 1,774 కోట్లతో (గతేడాదితో పోలిస్తే 267 శాతం అధికం) రెండో స్థానంలోనూ, రూ. 376 కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ మూడో స్థానంలో ఉన్నారు. అంబానీ విరాళాలు గతేడాదితో పోలిస్తే 8 శాతం తగ్గాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ చీఫ్ కుమార మంగళం బిర్లా రూ. 287 కోట్లతో నాలుగో స్థానంలో, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ రూ. 285 కోట్లతో (50 శాతం అధికం) ఈ జాబితాలో అయిదో స్థానంలో ఉన్నారు. ఇటీవలి హురున్ కుబేరుల జాబితా ప్రకారం అంబానీ సంపద రూ. 8.08 లక్షల కోట్లుగాను, అదానీది రూ. 4.74 లక్షల కోట్లు, నాడార్ సంపద రూ. 2.28 లక్షల కోట్లుగాను ఉంది. సంపద పెరిగే కొద్దీ సంపన్న కుటుంబాలు .. అట్టడుగు వర్గాల వారి కోసం ఆహారం, దుస్తులు, ఉపకార వేతనాలు మొదలైన దాతృత్వ కార్యకలాపాలకు విరాళాలిచ్చే ధోరణి పెరుగుతోందని హురున్ ఇండియా చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. లిస్టులో మొత్తం 119 మంది వ్యక్తులు, కుటుంబాలు ఉన్నాయి.

మరిన్ని వివరాలు..

- బజాజ్ కుటుంబంతో పాటు సైరస్ ఎస్ పూనావాలా, అదార్ పూనావాలా, రోహిణి నీలేకని వంటి వారు టాప్ 10లో నిల్చారు. మహిళల్లో నీలేకనితో పాటు అను ఆగా (థర్మాక్స్), లీనా గాంధీ తివారీ (యూఎస్‌వీ) కూడా ఉన్నారు.
- డిస్కౌంటు బ్రోకరేజీ జిరోధా సహ-వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ఈ జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు. కామత్ సోదరులు రూ. 110 కోట్లు విరాళమిచ్చారు.
- రూ. 150 కోట్ల విరాళంతో ఎల్‌అండ్‌టీ గౌరవ చైర్మన్ ఏఎం నాయక్ .. ప్రొఫెషనల్స్ జాబితాలో అగ్రస్థానంలో, ఓవరాల్ లిస్టులో 11వ స్థానంలో ఉన్నారు.

గెయిల్‌కు బీపీసీఎల్ ముడిసరుకు సరఫరా

రూ. 63,000 కోట్ల ఒప్పందం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నెలకొల్పుతున్న పెట్రోకెమికల్ ప్లాంటుకు అవసరమైన ముడిసరుకు కోసం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)తో గెయిల్ (ఇండియా) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 63,000 కోట్లు. దీని ప్రకారం 15 ఏళ్ల పాటు గెయిల్‌కు చెందిన ఉసార్ ప్లాంటుకు బీపీసీఎల్ తమ ఎల్‌పీజీ దిగుమతి కేంద్రం నుంచి ఏటా 6 లక్షల టన్నుల ప్రొపేన్ గ్యాస్‌ను సరఫరా చేయనుంది. ఉసార్‌లో 5,00,000 టన్నుల సామర్థ్యంతో గెయిల్ దేశీయంగా తొలి ప్రొపేన్ డీహైడ్రోజినేషన్ (పీడీహెచ్) ప్లాంటును నిర్మిస్తోంది. ఈ ప్లాంటు 2025 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఫర్నిచర్ ఉపకరణాలు, బొమ్మలు మొదలైన వాటిలో ఉపయోగించే పాలీప్రొపిలీన్ తయారీ ప్లాంటుకు ఇది అనుసంధానమై ఉంటుంది.

మార్కెట్‌కు 'ఫెడ్' బూస్ట్!

- ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లు యథాతథం
- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో జోష్
- 490 పాయింట్లు పెరిగి 64 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 144 పాయింట్ల లాభంతో 19,100 పైకి నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఊహించినట్లే యథాతథంగా ఉంచడంతో పాటు సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. దేశీయంగా వాహన విక్రయాలు రికార్డు గరిష్టానికి చేరుకోవడం, జీఎస్‌టీ వసూళ్లు పెరగడం, కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 490 పాయింట్లు పెరిగి 64,081 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144 పాయింట్లు బలపడి 19,133 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ఆద్యంతం జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 611 పాయింట్లు దూసుకెళ్లి 64,203 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు బలపడి 19,175 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. రియల్టీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా షేర్లకు చిన్న, మధ్య తరహా షేర్లు భారీ డిమాండ్ లభించింది. దీంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,261 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1380 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ నుంచి సానుకూల సంకేతాలు, జపాన్ ప్రభుత్వం 113 బిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీకి ప్రకటన, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ సైతం వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం తదితర పరిణామాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 1-2% ర్యాలీ చేశాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు 1-1.5 శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్‌ఈలో ఇన్వెస్టర్లు సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.1 లక్షల కోట్లు పెరిగి రూ. 313.32 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 షేర్లలో టెక్ మహీంద్రా(1%), బజాజ్ ఫైనాన్స్(0.25%) మాత్రమే నష్టపోయాయి.
- క్యూ2 నికర లాభం ఐదు రెట్లు వృద్ధి సాధించడంతో జేకే టైర్ షేరు 10% లాభపడి రూ.337 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ర్యాలీ చేసి రూ.351 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- క్యూ2 ఫలితాల ప్రకటన తర్వాత హీరో మోటో కార్ప్ షేరులో లాభాల స్వీకరణ జరిగింది. 1% నష్టపోయి రూ.3050 వద్ద స్థిరపడింది.

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ2లో రూ. 3,783 కోట్లు
- జేఎల్ఆర్ అమ్మకాలు జూమ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 3,783 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 1,004 కోట్ల నికర నష్టం ప్రకటించింది. బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) పనితీరు లాభాలకు దోహదపడింది. వెరసి వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. ఆదాయం రూ. 79,611 కోట్ల నుంచి రూ. 1,05,128 కోట్లకు దూసుకెళ్లింది. ఇక స్టాండెలోన్ ప్రాతిపదికన సైతం రూ. 1,270 కోట్ల నికర లాభం సాధించగా.. గతేడాది క్యూ2లో రూ. 293 కోట్ల నికర నష్టం నమోదైంది.

ఇకపై మరింత దూకుడు: తాజా సమీక్షా కాలంలో జేఎల్ఆర్ ఆదాయం 30 శాతం జంప్ చేసి 6.9 బిలియన్ పౌండ్లకు చేరింది. హోల్‌సేల్ అమ్మకాలు, కొత్త ప్రొడక్టులు, వ్యయ నియంత్రణలు, డిమాండుకు అనుగుణమైన పెట్టుబడులు ఇందుకు సహకరించాయి. కాగా.. ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్-మార్చి)లో హోల్‌సేల్ అమ్మకాలు క్రమంగా జోరందుకోనున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిట్) మార్జిన్లు గత 6 శాతం అంచనాలకంటే అధికంగా 8 శాతాన్ని తాకవచ్చని భావిస్తోంది. ఈ ఏడాది 2 బిలియన్ పౌండ్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను సాధించగలదని ఆశిస్తోంది. వెరసి మార్చికల్లా నికర రుణ భారం బిలియన్ పౌండ్లకంటే దిగువకు చేరవచ్చని అభిప్రాయపడింది.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 1.5% బలపడి రూ. 637 వద్ద ముగిసింది.

దండారీ ఉత్సవాలు షురూ

- పద్మల్‌పూరి కాకో ఆలయం ముస్తాబు
- ఆలయానికి గిరిజన భక్తుల తాకిడి



పద్మల్‌పూరి కాకో ఆలయం వద్ద గుస్సాడీలు, గిరిజన భక్తులు



కొలువుదీరిన పద్మల్‌పూరి కాకో

దండేపల్లి: తెలుగు రాష్ట్రాల్లోనే ఏకైక ఆలయంగా ప్రసిద్ధి చెందిన దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి ఒడ్డున ఉన్న ఆదివాసీల ఆరాధ్య దైవం పద్మల్‌పూరి కాకో ఆలయంలో దండారీ ఉత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రతియేటా ఆశ్వయుజ పౌర్ణమి తర్వాత ప్రారంభమయ్యే ఉత్సవాలు దీపావళి అమావాస్యతో ముగుస్తాయి. జిల్లాతోపాటు నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాలు, రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి ఆదివాసీ గిరిజనులు ఆలయానికి యేటా వస్తుంటారు. ఈసారీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆయా ప్రాంతాల నుంచి ఆదివాసీలు తరలి రానున్నారు.

ఆదివాసీల ఆరాధ్యదైవం

పద్మల్‌పూరి కాకో అమ్మవారు ఆదివాసీ గోండు, ప్రదాన్, కొలాం, తోటి గిరిజనులకు ఆరాధ్యదైవం. దసరా తర్వాత ఆలయం వద్ద జరిగే ఉత్సవాలకు కుటుంబ సమేతంగా వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. విందు వంటకాలు చేసుకుని పంక్తి భోజనాలు చేస్తారు.

ప్రత్యేక నైవేద్యాలు

అమ్మవారికి పాయసంతోపాటుగా రుబ్బిన పెసరు, మినుము, బబ్బెర గారెలు నైవేద్యంగా సమర్పిస్తారు. వీటిని గానుగతో తయారు చేసిన నువ్వులు, పల్లి నూనె వేసి తయారు చేస్తారు. వీటితోపాటు దంచిన బియ్యంతో తయారు చేసిన అరిసెలు కూడా నైవేద్యంగా పెడతారు. వీటికి సంబంధించిన ధాన్యాన్ని అరచేతితో కొలుస్తారు. మరి కొందరు కోళ్లు, మేకలు కూడా బలి ఇస్తారు.

అలరించే గుస్సాడీల నృత్యాలు..

ఆలయం వద్ద నిర్వహించే దండారీ ఉత్సవాల్లో గుస్సాడీల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. నెత్తిన నెమలి పింఛంతో తయారు చేసిన టోపీ, కళ్లకు అద్దాలు, భుజాన జింక తోలు, నడుము, కాళ్లకు గజ్జెలు ధరించి చేతిలో కోలా పట్టుకుని గిరిజన వాయిద్యాలు, డప్పు చప్పుళ్లకు గుస్సాడీలు చేసే నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.

భజనలు

ఆలయం వద్ద దండారీ ఉత్సవాలు ముగిసే వరకు ప్రతీ రోజు గిరిజనులు ప్రత్యేక భజనలు చేస్తారు. గిరిజన భాషల్లో పాటలు పాడుతూ ఆలయం వద్ద రాత్రి పగలు తేడా లేకుండా కొనసాగిస్తారు. దీంతో ఆలయం వద్ద ఉత్సవాలు ముగిసేదాకా సందడిగా నెలకొంటుంది.

పద్మశాలీల ఆత్మగౌరవాన్ని చాటుదాం



సిరిసిల్ల సభలో మాట్లాడుతున్న పత్తిపాక సురేశ్



ఆత్మగౌరవ సభకు హాజరైన పద్మశాలీలు

- కార్పొరేషన్లకు విధులు.. నిధులు లేవు
- సిరిసిల్లలో పద్మశాలీలు ఎమ్మెల్యే కావాలి
- చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్

సిరిసిల్ల: రాష్ట్రంలోని పద్మశాలీలు అందరూ సిరిసిల్ల వైపు చూస్తున్నారని పద్మశాలి అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకుని మన ఆత్మగౌరవాన్ని చాటిచెప్పాలని చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని లహరీ గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం పద్మశాలీల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సందర్భంగా వీరమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ పోటీచేసినా కేటీఆర్ గెలుస్తారని, ఆయన ఎక్కడైనా పోటీ చేయొచ్చని, స్థానికులైన పద్మశాలీలను సిరిసిల్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించాలని కోరారు. మునుగోడు ఎన్నికల నేపథ్యంలో టెక్స్‌టైల్, చేనేత కార్పొరేషన్లను ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించినా.. ఆ కార్పొరేషన్లకు విధులు లేవు.. నిధులు లేవని వీరమోహన్ ఆరోపించారు. పద్మశాలీలపై కేటీఆర్‌కు ప్రేమలేదని, అంతా కపట ప్రేమ అని విమర్శించారు. పద్మశాలీలు ఇప్పటికైనా ఏకమై ఏ పార్టీతో సంబంధం లేని పత్తిపాక సురేశ్‌ను గెలిపించుకోవాలని కోరారు. పద్మశాలి జేఏసీ వ్యవస్థాపకుడు వాసాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సిరిసిల్లలో పద్మశాలి సమాజం చాలా పెద్దదని, వారి ఆత్మగౌరవాన్ని దొరల కాళ్ల వద్ద తాకట్టు పెడుతున్నారన్నారు. బతుకమ్మ చీరలతో బతికిందెవరో అందరికీ తెలుసునన్నారు. పద్మశాలీలు ఇక్కడ ధైర్యంగా బతకడం లేదని, బానిసల్లా బతుకుతున్నారన్నారన్నారు. 60 ఏళ్లుగా ఒక్క పద్మశాలి నాయకుడు ఇక్కడ ఎమ్మెల్యే కాకపోవడం సిగ్గుచేటన్నారు. ఒకప్పుడు సిరిసిల్లలో ఆత్మహత్యలు ఎక్కువగా జరిగేవని, ఇప్పుడు అందరూ శవాల్లా జీవిస్తున్నారని విమర్శించారు. సిరిసిల్ల సభకు రావొద్దని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఫోన్లు చేశారని, ఆత్మగౌరవ సభకు వాళ్ల పర్మిషన్ ఏంటీ.. అని వచ్చినట్లు ఆయన వెల్లడించారు. యువ యుద్ధనౌక పత్తిపాక సురేశ్ మాట్లాడుతూ మీ బిడ్డగా ఒక్క చాన్స్ ఇవ్వాలని కోరారు. గెలిస్తే.. మీకు నచ్చినట్లు పని చేయకుంటే.. అందుబాటులో ఉండకుంటే.. రెండేళ్లలో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చేనేత ఐక్యవేదిక హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు ఆర్.వేదశ్రీ, పద్మశాలి సంఘం నాయకులు జక్కని సంజయ్, పత్తిపాక పద్మ-శంకర్, గుడ్ల వెంకన్న, గున్నాల దేవదాస్, రాపెల్లి ఆనందం, సామల రాము, డాక్టర్ మిట్టపల్లి రాజమౌళి, రాపెల్లి రమేశ్, మోర శ్రీకాంత్, మచ్చ శ్రీనివాస్, పత్తిపాక రోహిణి, గుజ్జె తార, ఎనగందుల రూప తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

- ఉమ్మడి జిల్లాకు ఆరుగురు ఐఏఎస్, నలుగురు ఐపీఎస్‌లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎన్నికల తీరును ఎప్పటికప్పుడు పరిశీలన చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక అధికారులను నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఐఏఎస్ స్థాయి అధికారులకు సాధారణ పరిశీలకులుగా, ఐపీఎస్ అధికారులను పరిశీలకులుగా పంపింది. పలు రాష్ట్రాలకు చెందిన సివిల్ సర్వీసెస్ అధికారులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల్లో ఎన్నికల సందర్భంగా పర్యటిస్తూ ప్రతీది గమనిస్తుంటారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు సజావుగా సాగడానికి, అధికారులు నిష్పక్షపాతంతో పని చేసేలా, స్థానిక అధికారుల తోపాటు, పోటీలో ఉన్న అభ్యర్థుల తీరును గమనిస్తుంటారు. విధుల్లో ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారు. ఇందు కోసం ప్రత్యేకంగా జిల్లా ఎన్నికల అధికారి ఫోన్ నంబర్లు కూడా ఈ అధికారులకు అందుబాటులో ఉంచుతారు. క్షేత్రస్థాయిలో రోజువారీగా పరిశీలిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తారు. ఈ నెల 10న నామినేష్ల ప్రక్రియ ముగిశాక విధులు ప్రారంభించి పోలింగ్ పూర్తయ్యే 30వరకు పరిశీలకులుగా వ్యవహరిస్తారు.

సాధారణ పరిశీలకులు	కేటాయించిన నియోజకవర్గం
రాహుల్ రంజన్ మహివాల్	సిర్పూర్, ఆసిఫాబాద్
సజ్జన్ ఆర్	చెన్నూరు,
బిశ్వజిత్ దుత్తా	బెల్లంపల్లి, మంచిర్యాల
జి.బి.పాటిల్	ఆదిలాబాద్, బోథ్
గోపాల కిషన్ కె	ఖానాపూర్
రవిరంజన్‌కుమార్ విక్రమ్	నిర్మల్, ముథోల్
పోలీసు పరిశీలకులు	**కేటాయించిన నియోజకవర్గం**
డాక్టర్ డీకే.చౌదరి	సిర్పూర్, ఆసిఫాబాద్
ఇల్లంగో ఆర్	చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల
అశోక్ గోయల్	ఆదిలాబాద్, బోథ్
లక్ష్మణ్ నింబార్గి	ఖానాపూర్, నిర్మల్, ముథోల్

జాతీయ సదస్సులో ట్రిపుల్‌ఐటీ వీసీ



సదస్సుకు హాజరైన వీసీలు

భైంసా: దేశ రాజధాని న్యూఢిల్లీలో గురువారం నిర్వహించిన జాతీయ సదస్సులో బాసర ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నీతి అయోగ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను విస్తరించే అంశంపై సదస్సు నిర్వహించారు. 22 రాష్ట్రాల నుంచి 60 మంది వీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సదస్సులో ట్రిపుల్‌ఐటీ వీసీ వెంకటరమణ పలు సూచనలు చేశారు. విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించేందుకు ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయన్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్సింగ్, యూనివర్సిటీల పాలన, సాంకేతిక విశ్వవిద్యాలయాలతో సహకారం తదితర అంశాలపై చర్చించారు.

అవగాహన ఒప్పందం...

ఈ సదస్సులో ట్రిపుల్‌ఐటీ బాసర, మేఘాలయాలోని సైన్స్‌అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయంలో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంలో రెండు విశ్వవిద్యాలయాలు ఉన్న ప్రయోగశాలలు సాంకేతిక కోర్సుల అభివృద్ధికి కావాల్సిన సహాయ సహకారాలను అందించుకోవాలని చర్చించారు. మేఘాలయ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ గౌరిదత్‌శర్మ, బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అవగాహన ఒప్పందం చేసుకున్నారు.

ఇంధన పొదుపుపై పెయింటింగ్ పోటీలు

- ఎన్టీపీసీ ఎస్ఆర్‌హెచ్‌క్యూ, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఆధ్వర్యంలో నిర్వహణ
- దరఖాస్తుకు 6 వరకు గడువు

జ్యోతినగర్(పెద్దపల్లి): ఇంధన పొదుపుపై జాతీయ పెయింటింగ్ పోటీలను కేంద్ర ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ సహకారంతో ఎన్టీపీసీ సదరన్ రీజియన్ హెడ్ క్వార్టర్స్, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు స్టేట్ నోడల్ అధికారులు బద్రుద్దీన్ అన్సారీ, ప్రియాంక భయాన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది గొప్ప అవకాశమని, రాష్ట్ర విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

రెండు గ్రూపులుగా నిర్వహణ

జాతీయ స్థాయి పెయింటింగ్ పోటీలను ఏ, బీ గ్రూపులుగా విభజించి నిర్వహించనున్నారు. ఏ-గ్రూపులో 5, 6, 7 తరగతులు, బీ-గ్రూపులో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అవకాశం కల్పించారు. పోటీలు రాష్ట్ర/కేంద్ర పాలిత, జాతీయ స్థాయిల్లో జరగనున్నాయి. ఆసక్తి గలవారు ఈ నెల 6వ తేదీలోపు www.bee-studentsaward.in లో దరఖాస్తు చేసుకోవాలి.

ఈ అంశాలపై పోటీలు..

లైఫ్-పర్యావరణహిత జీవనశైలి లేదా మనం-భూగ్రహ అనుకూల ప్రజలం.



పెయింటింగ్ పోటీల లోగో

అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు



రామగుండం: రామగుండం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం విధులు నిర్వహించిన కోట వెంకటశివశాస్త్రి వేలాది మంది పూర్వ విద్యార్థులు, స్థానికులకు సుపరిచితుడు. ఈ నేపథ్యంలో గుంటూరులో నివాసముంటున్న వెంకటశివశాస్త్రి తండ్రి ప్రసిద్ధ హరికథ విద్వాంసులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట సచ్చిదానందశాస్త్రి దేశ వ్యాప్తంగా 1500 పైగా హరికథ ప్రదర్శనలిచ్చారు. ఈ క్రమంలో తన కళను గుర్తించి ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడలోని ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేశారు. కాగా గురువు తండ్రి అవార్డు స్వీకరించడంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ పూర్వ ఉపాధ్యాయుడు వెంకటశివశాస్త్రికి అభినందనలు తెలిపారు.